క్రీస్తు బోధనలు అనుసరణీయం

అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ కేంద్రాలు, మండలాలు, గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు క్రిస్మస్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

• క్రీస్తు బోధనలు ఎప్పటికి అనుసరణీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలో క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని పలు చర్చీల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్‌తో కలిసి పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆశీర్వదించారు. అనంతరం చర్చీలోని ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడారు. వారి క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కేక్ కటింగ్ కార్యక్రమాల్లో పాల్గొని క్రిస్మస్ శుభాకంక్షలు తెలియజేశారు.

అందరూ ఆచరించాలి

కరుణ, ప్రేమ, దయ, త్యాగం, అనేవి మానవ జీవితానికి అవసరమని, వాటిని అనుసరించాలని చెప్పిన ఏసు క్రీస్తు బోధన అందరూ పాటించాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని వివిధ చర్చిల్లో జరిగిన వేడుకల్లో పాల్గొని క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేశారు.

• బల్మూర్ మండలంలోని పోలిశెట్టిపల్లిలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ క్రైస్తవులకు దుస్తులు పంపిణీ చేశారు.

• ప్రతిఒక్కరూ ప్రేమభావాలతో మెలిగి పేద ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా తాడూరు మండలంలోని యాదిరెడ్డిపల్లి చర్చిలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. – 'సాక్షి' నెట్‌వర్క్



కల్వకుర్తి ఎంబీ చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



తెలకపల్లిలో పుష్పగుచ్ఛం ఇచ్చి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని సన్మానిస్తున్న క్రైస్తవ సోదరులు



అచ్చంపేట చర్చిలో క్రైసవులకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



దోమలపెంట చర్చిలో..





కొల్లాపూర్‌లో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు



వెల్దండ మండలం రాచూర్ చర్చిలో ప్రార్థనలు



పెంట్లవెల్లి చర్చిలో వేడుకలకు హాజరైన క్రైస్తవులు



కుడికిల్లలో కేక్ కట్ చేస్తున్న సంఘ సభ్యులు



పెద్దకొత్తపల్లిలో ర్యాలీ

కాగితాలతో క్రిస్మస్ ట్రీ

అచ్చంపేట రూరల్: ఆ చిన్నారి విద్యార్థులు తమలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీశారు. క్రిస్మస్ పండుగ రోజు తమ సృజనకు పదును పెట్టారు. పట్టణంలోని ఇచ్‌డయాన్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న రేసోజు విఘ్నేష్, 5వ తరగతి చదువుతున్న నాగేందర్‌యాదవ్, గౌతమ్, సిరిశివజ తెల్లటి కాగితాలను సేకరించి, వాటిపై రంగులు దిద్ది రెండు గంటల పాటు శ్రమించి క్రిస్మస్ ట్రీని తయారు చేశారు. దానికి రంగు రంగు లైట్లను అమర్చారు. అలాగే శాంతా క్లాజ్ బొమ్మను తయారు చేశారు. చిన్నారుల ప్రతిభను పలువురు అభినందించారు.



చిన్నారులు తయారు చేసిన క్రిస్మస్ ట్రీ

క్లుప్తంగా

26న ఫొటో, వీడియో గ్రాఫర్ల సమావేశం

కొల్లాపూర్: నియోజకవర్గ ఫొటో, వీడియోగ్రాఫర్ల సంఘం సమావేశం ఈ నెల 26న కొల్లాపూర్‌లో నిర్వహించనున్నట్లు ఫొటో, వీడియో గ్రాఫర్ల సంఘం జిల్లా ముఖ్య సలహాదారు కట్టా శ్రీనివాసులు ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు షబ్బీర్ తెలిపారు. సమావేశానికి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు నేతాజీగౌడ్ హాజరవుతారన్నారు. ఫొటో గ్రాఫర్లకు ఇళ్ల, స్థలాలు, ఇన్సూరెన్సు వంటి అంశాలపై చర్చ ఉంటుందన్నారు.

28న మండల సర్వసభ్య సమావేశం

పెద్దకొత్తపల్లి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 28న నిర్వహించనున్నట్లు ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, ఎంపీడీఓ కృష్ణయ్య తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు. మండల స్థాయి అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి రావాలన్నారు.

ఆరోగ్యంగా ఉండాలి

తెలకపల్లి: ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని పెద్దపల్లిలో యశోదా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి ఎమ్మెల్యే హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని కొనసాగిస్తుందన్నారు. ఏఒక్కరూ ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయవద్దని, ప్రస్తుతం చలికాలం కావడంతో ఇంకా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల



పెంట్లవెల్లి: మండలంలోని మల్లేశ్వరం, యంగంపల్లి తండా, మంచాలకట్ట గ్రామాల్లో బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో యువకులు మల్లేశ్వరంలోని అయోధ్య రాముడి కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా బజరంగ్‌దళ్ మండలాధ్యక్షుడు పల్లె శివ మాట్లాడారు. ప్రతి గ్రామంలోని ఆలయాల్లో శ్రీరాముడి అక్షతలు అందించి పత్రాలు విడుదల చేయడం జరుగుతుందని, అంతే కాకుండా ఆ అక్షతలను ప్రతిఇంటికి పంపిణీ చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ అయోధ్య రాముడిని దర్శించుకునేందుకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. శివ, స్వాములు, పోతుల కిరణ్ తేజ్, గంగాధర్ పాల్గొన్నారు.

మైలారం సర్పంచ్‌కు ఉత్తమ అవార్డు



బల్మూర్: మండలంలోని మైలారం సర్పంచ్ ఎల్లికంటి శ్రీనువాసులు సోమవారం హైదరాబాద్ రవీంద్రభారతిలో ఉత్తమ సర్పంచ్ అవార్డును అందుకున్నారు. వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ పాలన, సైవలో ఉత్తమ ప్రతిభకు గాను గుర్తింపుగా ఇంటర్నేషనల్ స్పెషల్ అవార్డ్స్‌కి ఎంపిక కావడంతో తాను వల్లూరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీనువాసరాజన్ చేతులమీదుగా అవార్డు అందుకున్నట్లు చెప్పారు. సర్పంచ్‌ను గ్రామస్తులు అభినందించారు.

ధనుర్మాస పూజలు



కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని రామమందిరం, మాధవస్వామి దేవాలయం, బండాయిగుట్ట వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ధనుర్మాస పూజలు కొనసాగుతున్నాయి. సోమవారం తెల్లవారుఝామున ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామమందిరంలో మహిళలు కుంకుమార్చన చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతాలు

తాడూరు: మండలంలోని సిర్సవాడలో రేణుకా ఎల్లమ్మ దేవాలయ ఆవరణలో సోమవారం పూజారి జగదీశ్వరాచారీ ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రతి ఏటా నిర్వహిస్తామని, అందులో భాగంగా నిర్వహించి, పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశామని తెలియజేశారు.

కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌ని కలిసిన సర్పంచ్

కల్వకుర్తి రూరల్: మండలంలోని తోటపల్లి సర్పంచ్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి పసుల రాజేష్‌రెడ్డి సోమవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల నూతన ఇన్‌చార్జ్ దీప్‌దాస్ మున్షీని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా పార్టీలో తాను పనిచేస్తున్న విషయంతో పాటు మూడు సార్లు సర్పంచ్‌గా ఎన్నికైన విషయాన్ని ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్లగా ఆమె అభినందించారని రాజేష్ రెడ్డి విలేకరులకు తెలియజేశారు.

మార్మోగుతున్న హనుమనామస్మరణ



స్వామివారి సన్నిధిలో సీతారాముల కల్యాణం

అమ్రాబాద్: నల్లమల ప్రాంతం పదర మండలంలోని మద్దిమడుగు క్షేత్రంలో వెలిసిన పబ్బతి అభయాంజనేయుడు భక్తుల పూజలందుకుంటున్నాడు. దీక్షమాల విరమణ ఉత్సవాల సందర్భంగా నియమ నిష్ఠలతో దీక్షలు చేపట్టిన మాలధారణ భక్తులు ఇరుముడులతో స్వామి సన్నిధికి చేరుకొని అక్కడ మాల విరమణ పొందుతున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం గవ్యాంతర పూజలు, రుద్రహోమం నిర్వహించారు. భక్తులు స్వామికి అభిషేకాలు, అర్చనలు చేసి మొక్కులు తీర్చుకుంటున్నారు. రాత్రి సీతారాముల కల్యాణం నిర్వహించారు.

తరలివస్తున్న భక్తులు..

ఆంజనేయ స్వామి దీక్షమాలధారణ భక్తులు 41 రోజు నియమ నిష్ఠలతో ఉండి స్వామి సన్నిధిలో మాలవిరమణ పొందుతారు. ఇందు కోసం చాలా మంది భక్తులు వాహనాల్లో స్వామి సన్నిధికి చేరుకుంటున్నారు. మరికొంత మంది మాలధారణ భక్తులు మద్దిమడుగు క్షేత్రానికి పాదయాత్రన చేరుకుంటున్నారు. ఈ సందర్భంగా మద్దిమడుగులో హనుమన్నామ స్మరణ మార్మోగుతుంది. అమ్రాబాద్ సీఐ ఆదిరెడ్డి, పదర ఎస్‌ఐ తిరుపతిరెడ్డి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నారు. పదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. ఉత్సవాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి రంగాచారి, అధికారులు జైపాల్‌రెడ్డి, జంగయ్య, ప్రధాన అర్చకులు వీరయ్యశర్మ, వీరయ్య శాస్త్రి తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

తెలకపల్లి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన, భక్తిపారవశ్యంలో ఉండాలని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని హనుమాన్ దేవాలయంలో హనుమాన్ ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి హాజరై హనుమాన్ భక్తులతో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలన్నారు. ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయంలో సోమవారం ఆంజనేయ మాలధారణ స్వాముల ఇరుముడి నిర్వహించారు. 41 రోజుల పాటు దీక్ష పూర్తి చేసిన స్వాములకు గురుస్వామి లింగం ఇరుముడి తంతు నిర్వహించారు. ఇరుముడి ఎత్తుకున్న స్వాములు మద్దిమడుగు పబ్బతి ఆంజనేయస్వామి సన్నిధానానికి తరలివెళ్లారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం ఏర్పాటు చేశారు.

కూచిపూడి డ్యాన్స్ లెసన్ గిన్నిస్‌లో ప్రతిభ

అచ్చంపేట రూరల్: తెలుగు వారి ప్రాచీన నృత్యం కూచిపూడి డ్యాన్స్ లెసన్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లోకి ఎక్కింది. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఏకకాలంలో 3,783 మంది కళాకారులు కూచిపూడి నృత్యం చేసి కళా వైభవాన్ని ప్రపంచానికి చాటారు. నృత్య ప్రదర్శనలో నల్లమల ప్రాంతం అచ్చంపేటకు చెందిన కపిలవాయి రాంమోహన్, ప్రవళిక కుమార్తె కపిలవాయి శ్రేష్ఠ మోహన్‌కు అవకాశం దక్కింది. ఆదివారం రాత్రి గచ్చిబౌలి అథ్లెటిక్ స్టేడియంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి కళావైభవం పేరిట లార్జెస్ట్ కూచిపూడి డ్యాన్స్ లెసన్ ప్రదర్శించారు. స్టేడియం నలుమూలలా ఏడు నిమిషాల పాటు కళాకారులు నృత్యం చేస్తూ అలరించారు. నల్లమల ప్రాంత విద్యార్థిని ఈ ప్రాంతం ప్రతిష్ఠను చాటింది. విద్యార్థిని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో భాగస్వామ్యమైనందుకు డీసీసీ ఉపాధ్యక్షుడు కపిలవాయి చంద్రమోహన్, ముత్యాలుచారి, విశ్వేశ్వరాచారి, రాఘవాచారి, శ్రీనివాసాచారి, బ్రహ్మచారి, జంగాచారి పలువురు అభినందించారు.



ఘనంగా వాజ్‌పేయి జయంతి



లింగాలలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

కల్వకుర్తి రూరల్: దేశ మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని సోమవారం కల్వకుర్తి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వాజ్‌పేయి అడుగుజాడల్లో ప్రతి బీజేపీ కార్యకర్త అడుగులు వేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దుర్గాప్రసాద్ కోరారు. పట్టణ అధ్యక్షుడు నర్సింహ, శేఖర్‌రెడ్డి, రవిగౌడ్, బాబీదేవ్, వివేకానంద పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

లింగాల: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతిని మండల కేంద్రంలో సోమవారం బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సలేశ్వరం, విష్ణు, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ అశోక్, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మరిన్ని సేవలు

కల్వకుర్తి రూరల్: వాసవీక్లబ్‌ల ద్వారా సమాజంలోని అన్ని వర్గాలకు అందిస్తున్న సేవలను మరింత ముందుకు తీసుకెళ్లాలని వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ జూలూరు రమేష్ బాబు కోరారు. సోమవారం వాసవీ క్లబ్ 2024 కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా చిదిరె శ్రీనివాసులు, కార్యదర్శిగా ఆంజనేయులు, కోశాధికారిగా అశోక్, వనితా క్లబ్ అధ్యక్షురాలిగా శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మి, కోశాధికారిగా ధనలక్ష్మి ఎంపికయ్యారు. రీజినల్ చైర్మన్‌గా జూలూరు సత్యనారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడారు. రాబోయే సంవత్సర కాలం పాటు ఈ కమిటీ సామాజిక సేవలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్ హరికృష్ణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కల్మిచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నుకున్న అధ్యక్షుడిని రమేష్ శాలువాతో సత్కరించారు.

రైతు రుణమాఫీ అమలు చేయాలి

కొల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వెంటనే రైతులకు రూ.2 లక్షల మేరకు రుణమాఫీని అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ కోరారు. సోమవారం కొల్లాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో సీపీఎం నాయకులు సమావేశమయ్యారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే రైతుబంధు డబ్బులు అకౌంట్లలో జమ చేస్తామని చెప్పారని, ఇప్పటి వరకు రైతులకు రైతుబంధు డబ్బులు జమ చేయలేదన్నారు. ఈ నెల 28 నుంచి ప్రజాపాలన పేరుతో నిర్వహించే గ్రామసభలను పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సమావేశంలో నాయకులు చంద్రునాయక్, కిరణ్‌కుమార్, తారాసింగ్, బత్తిని రాజు, బాలునాయక్, సంజీవ్ తదితరులున్నారు.

క్లాస్‌మేట్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

అచ్చంపేట రూరల్: క్లాస్‌మేట్ క్లబ్ డివిజన్ కార్యవర్గాన్ని సోమవారం అచ్చంపేటలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెద్ది మురళి, ప్రధాన కార్యదర్శిగా ఓరుగంటి సాయి ప్రసాద్, కోశాధికారిగా కొత్ర రమేష్, ఉపాధ్యక్షుడిగా జూలూరి ప్రదీప్‌ను ఎన్నుకున్నారు. కమిటీని సభ్యులు ఘనంగా సన్మానించారు. క్లాస్‌మేట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్, పోలిశెట్టి నరేష్, గోపాల్ నాయక్, సాయిరాం, పాండురంగం, విశ్వేశ్వరయ్య పాల్గొన్నారు.

భక్తిభావంతో మెలగాలి

కల్వకుర్తి రూరల్: సమాజంలోని ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. సోమవారం పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో నిర్వహించిన మహాపడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు మహాపడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని శాలువాతో సత్కరించారు. అనంతరం కల్వకుర్తి మండలం మార్చాల గ్రామపంచాయితీ పరిధిలోని శ్రీలత కాటన్ మిల్ సమీపంలోని చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ భక్తిభావంతో మెలగాలని కోరారు. ఆయన వెంట బాలాజీ సింగ్, ఆనంద్ కుమార్, సంజీవ్ యాదవ్, సతీష్ తదితరులు ఉన్నారు.

హామీలపై స్పష్టత ఏదీ?

అచ్చంపేట: కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీపై ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వడం లేదని అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. సోమవారం అచ్చంపేటలో ఆయన నివాసంలో విలేఖరులతో మాట్లాడారు. ప్రజలకు సంక్షేమ పాలన అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. ఇప్పటికైన డిమాండ్లు పరిష్కరించేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. పదేళ్లలో మేము ఎక్కడ కూడా హెచ్చరికలు, దాడులకు పాల్పడలేదన్నారు. ఈ రోజు కాంగ్రెస్ వారు దాడులకు, నిర్బంధాలకు పాల్పడుతున్నారని చెప్పారు. గెలిచిన, ఓడిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు తాను ఎప్పుడు అండగా ఉంటానని చెప్పారు. అనంతరం పట్టణంలోని చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నర్సింహగౌడ్, మాజీ ఎంపీపీ కె.తులసీరాం, జెడ్పీటీసీ రాంబాబు, కౌన్సిలర్లు మనుప్రసాద్, శివ, శ్రీనివాసులు తదితరలు పాల్గొన్నారు.



అచ్చంపేటలో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

దేవాలయ నిర్మాణం పనుల పరిశీలన

లింగాల: మండల పరిధిలోని దత్తారంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఆర్థికసాయంతో చేపట్టిన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం పనులను సోమవారం సింగిల్ విండో చైర్మన్ హన్మంతురెడ్డి, మాజీ జెడ్పీటీసీ మాకం తిర్పతయ్య పరిశీలించారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూడాలని గుత్తేదారుకు సూచించారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వెంకటగిరి గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి సీపీఐ వార్షికోత్సవాలు

తెలకపల్లి: సీపీఐ 99వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి వేనెపల్లి రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ నెల 26 నుంచి సీపీఐ 99వ వార్షికోత్సవాలు జరగనున్నాయని, వార్షికోత్సవాలను పురస్కరించుకుని సీపీఐ గ్రామశాఖల వారీగా మండలంలోని గ్రామాల్లో సీపీఐ జెండాలను ఎగురవేయాలని కోరారు. పేద ప్రజలు, కార్మికుల పక్షాన నిలిచిన సీపీఐ పోరాటాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

దళితుల అభ్యున్నతికి కృషి

కొల్లాపూర్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా దళితుల అభ్యున్నతికి గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన దళిత బంధు పథకాన్ని ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని తెలంగాణ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన నార్లాపూర్‌లో దండోరా కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దళితబంధు తీసివేస్తే తెలంగాణ వ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. దళిత బంధుతో రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే దాదాపుగా లక్షలాది మంది దళితులు జీవనోపాధి పొందడం జరిగిందన్నారు. పది లక్షలతో లక్షణంగా బతుకుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వం మంజూరు చేసిన యునిట్లను కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో దండోరా నాయకులు పాల్గొన్నారు.


రాజ్యాంగాన్ని రక్షించుకుందాం



కల్వకుర్తిలో కేవీపీఎస్ నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: స్థానిక జిల్లా కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ విగ్రహం వద్ద మనుధర్మ శాస్త్ర ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడా లేనంతగా భారతదేశంలో సామాజిక అసమానతలను సృష్టించి వివక్షకు కారణమైంది మనుధర్మశాస్త్రమేనని, అశాస్త్రీయమైన మనుధర్మాన్ని మంటల్లో దగ్ధం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దళిత బహుజనులంతా ఒక్కటై నిలిచి రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా నాయకులు కృష్ణ, అంతటి వెంకటయ్య, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని మహబూబ్‌నగర్ చౌరస్తాలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి పరశురాములు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, కుర్మయ్య, అశోక్, జగన్, నర్సింహ, జంగయ్య పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్‌లో..

అచ్చంపేట రూరల్: పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో మనుస్మృతి పత్రాలను దహనం చేశారు. అంజయ్య, అనిల్‌కుమార్, మానిక్‌బాబు, లక్ష్మీనారాయణ, మోహన్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.